క్లుప్తంగా

వేసవి విజ్ఞాన శిబిరం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కీర్తి హాల్ సమీపంలోని వినుకొండ శాఖ గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. దీనిలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి భూక్యా బద్రినాయక్ తెలిపారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాస్‌లను మాస్టర్ కోటేశ్వరరావు బోధించారు.

సచివాలయం సందర్శన



వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల మండలంలోని తలార్లపల్లి గ్రామ సచివాలయాన్ని డీఎల్‌డీవో వెంకటరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, ఎస్‌డీజీ సర్వే, రైతుల ఈకేవైసీ, గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ స్కీమ్ సర్వేపై ఆరా తీసి సూచనలు చేశారు.

ఉచిత ఆయుష్ వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలని, రోజుకు ఐదు లీటర్ల నీటిని తాగాలని, ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. మజ్జిగ, గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరినీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎండకు వెళ్లేటప్పుడు టోపీ, కండువా, చున్నీ, గొడుగు వినియోగించాలన్నారు. వడదెబ్బ నివారణ, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆయుష్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మహాలక్ష్మి, గ్రామపెద్దలు సుబ్బారావు, కోటేశ్వరమ్మ, సాయి, రాజశేఖర్, గంగమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

18న పాత వస్తువులకు బహిరంగ వేలం

నాదెండ్ల: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సామగ్రికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కె.ప్రియాంక తెలిపారు. పాత ఇనుప వస్తువులు, తలుపులు, కిటికీలు, మరికొన్ని వస్తువులు వేలానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రి పనిచేసే సమయాల్లో సంప్రదించాలని కోరారు. ఈనెల 18న బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు సీనియర్ సహాయకులు హనమంతనాయక్‌ను 99891 76074 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



శావల్యాపురం: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య చెప్పారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో రోజుకు 3,500 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని వయ్యకల్లు గ్రామ పంచాయతీలో అనివార్య కారణాల వల్ల ఉపాధి పనులు మూడు రోజుల నుంచి జరగటం లేదన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఉపాధి కూలీలు అధికారులు చెప్పినట్టు చేయాలని, తద్వారా రోజు వారి వేతనం రూ.270 వరకు వస్తుందన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, టీపీ శ్రీనివాసగుప్తా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్ వద్ద సోమ వారం అర్ధరాత్రి జరిగింది. నందిగామ గ్రామానికి చెందిన కొడిరెక్క ముసలయ్య (65), మోడీ జాన్‌లు ద్విచక్రవాహనం పై నందిగామ నుంచి సత్తెనపల్లి వస్తున్నారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన లారీ గుంటూరు వెళ్తుంది. నందిగామ అడ్డరోడ్డు వద్ద ద్విచక్రవాహనం, లారీ ఢీకొనడంతో ముసలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. జాన్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ముసలయ్య మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని మనవడు కోడిరెక్కవెంకట్రావు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసు లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

పేదరిక నిర్మూలనే సంక్షేమ పథకాల లక్ష్యం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని బొప్పూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరును వివరించారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి చెప్పారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రభుత్వం కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని వెల్లడించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకు మాత్రమే దక్కుతోందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో లభిస్తున్న ఆదరణే ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, సర్పంచ్ షేక్ రమేష్‌బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా యాములయ్య, అమీర్‌జాని, అప్పాపురం మస్తాన్, మీరాబుడే, సైదా, రజాక్, పుల్లారావు, నాని తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన



డెంగీపై అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసాద్‌నాయక్



ర్యాలీలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది



రొంపిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



చిలకలూరిపేటలో..

నాదెండ్ల: జ్వరంతో కూడిన కీళ్ళనొప్పులు, కండరాల నొప్పులు వస్తుంటే డెంగీ లక్షణాలుగా భావించి ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి ఎల్.ప్రసాద్‌నాయక్ చెప్పారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ డెంగీ దినం నిర్వహించారు. ముందుగా సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ నుంచి ఉన్నత పాఠశాల మీదుగా బొడ్డురాయి వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రసాద్‌నాయక్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ షేక్ అజీజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): జాతీయ డెంగీ దినాన్ని పురస్కరించుకొని వినుకొండ సీహెచ్‌సీలో రూరల్, అర్బన్ ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో పలువురు మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. దోమల నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ సూపర్‌వైజర్ పి.బాలస్వామి, కె.వెంకట్రావు, సూపర్‌వైజర్ ఆర్.రత్నకుమారి, వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల : వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం జాతీయ డెంగీ దినాన్ని నిర్వహించారు. అవగాహన ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేవతిభాయి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, హెల్త్ సూపర్‌వైజర్ షేక్ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: జాతీయ డెంగీ దినం సందర్భంగా పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల పరిధిలో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్‌సీహెచ్ నారాయణ మాట్లాడుతూ దోమల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా యూపీహెచ్‌సీల డాక్టర్లు, మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది ఎస్‌వీ చలమారెడ్డి, ఎస్.శివయ్య, బీఎస్ కోటేశ్వరరావు, షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల మెరుగుకే ఫ్యామిలీ ఫిజిషియన్



బొల్లాపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవల మెరుగే ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ముఖ్య ఉద్దేశమని బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.పెద్దసైదులు తెలిపారు. రేమిడిచర్ల సబ్‌సెంటర్ పరిధిలో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైద్యసేవలు అందించారు. స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తహీనతతో ఉన్నవారికి సూచనలు చేసి వైద్య సేవలు అందజేశారు. 136 మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, 64 మంది స్వల్పకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు 45 మందికి ఉచితంగా వైద్యసేవలు అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



రొంపిచర్ల : సంతగుడిపాడులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రముఖ కవి అచ్చుల సుబ్బారావు ప్రారంభించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని శాఖా గ్రంథాలయాధికారి కె.వెంకట్రావు తెలిపారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



గురజాల : స్థానిక వీఎంఏఎస్ క్లబ్‌లో నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మూడు రోజులుగా వాలీబాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. మొత్తం 26 జట్లు పాల్గొన్నాయి. వాటిలో మొదటి బహుమతి గుల్లపల్లి టీం, రెండవ బహుమతి గుంటూరు టీం, మూడవ బహుమతి భావపూరి బాపట్ల టీం, నాలుగవ బహుమతి ప్రకాశం టీం, ఐదవ బహుమతి మాచర్ల టీంలు దక్కించుకున్నాయి. విజేతలకు వైద్యులు, చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చల్లగుండ్ల శ్రీనివాస్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో అక్కినపల్లి సైదులు, పలగాని చంద్రశేఖర్‌రెడ్డి, చిట్టిమాల ప్రసాద్, తోట వెంకట్రావు, జంపని లింగారావు, శ్రీరామ్ సాంబ, కోటి, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

20న బీసీ డే



పిడుగురాళ్ల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

పిడుగురాళ్ల: మే 20న బీసీ డేగా నిర్వహించాలని గురజాల నియోజకవర్గంలోని బీసీలందరూ తీర్మానించినట్లు బీసీ నాయకులు వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కుందుర్తి గురవాచారి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కుందుర్తి గురవాచారి, పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, మాచవరం జెడ్పీటీసీ జువ్వెన బోయిన శివాయాదవ్, వైఎస్సార్ సీపీ గురజాల మండల కన్వీనర్ సిద్ధాడపు గాంధీలు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ సాధించి 92 కులాలకు బీసీ రిజర్వేషన్ కల్పించిన ఘనత కాసు బ్రహ్మానందరెడ్డికే దక్కిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాసు బ్రహ్మానందరెడ్డి మొట్టమొదటిగా 1966లో బీసీ రిజర్వేషన్ జీఓను ఏర్పాటు చేశారని, 1968లో ఆధారాలు లేవని అప్పటి హైకోర్టు జీవోను కొట్టివేసిందని పేర్కొన్నారు. అయితే అప్పటి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు కూడా హైకోర్టు తీర్పునే ఏకీభవించిందని, అయినప్పటికి కాసు బ్రహ్మానందరెడ్డి పట్టువిడవని విక్రమార్కుడిలా బీసీ రిజర్వేషన్ కోసం 1970 జూన్‌లో కమిటీని ఏర్పాటు చేసి రెండు నెలల్లో అసెంబ్లీల్లో బిల్లు పెట్టి తీర్మానించడంతో బీసీ రిజర్వేషన్ సాధించారని గుర్తుచేశారు. ఈ బీసీ రిజర్వేషన్ ద్వారా 92 వెనుక బడిన తరగతి వారు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్‌లు పొంది నేడు ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. వెనుక బడిన తరగతుల వారి అభివృద్ధి కోసం పోరాడి బీసీ రిజర్వేషన్ సాధించిన కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతి మే 20న కావడంతో గురజాల నియోజకవర్గంలోని బీసీ నాయకులంతా కలిసి బీసీ డేగా జరపాలని తీర్మానించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, కౌన్సిలర్ కొక్కెర శ్రీను, కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, బీసీ నాయకులు మద్దు ప్రసాద్, అద్దంకి శ్రీనివాసరావు, యెనుముల వెంకటేశ్వర్లు, చల్లా కాశీబాబు, తురకా ముక్కంటి, దేవళ్ల వీరాస్వామి, నాగరాజు, హనుమంతరావు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై మహిళలకు ఉచిత శిక్షణ

మాచర్ల: వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు అధ్యక్షుడు ఒరుగంటి చెన్నకేశవరావు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో గ్రామీణ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరు రోజుల శిక్షణలో ఉచిత భోజన సదుపాయం ఉందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. 19 నుంచి 44 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9849065882ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పందిరి నరసింహారావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, కోశాధికారి ముప్పవరపు నాగార్జున, జాయింట్ సెక్రెటరీ బచ్చు రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సాగర్ కాల్వ నుంచి మృతదేహం వెలికితీత



కారెంపూడి: సాగర్ కుడి కాల్వ నుంచి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని మంగళవారం సాయంత్రం కారెంపూడి పోలీసులు వెలికి తీయించారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ సమీపంలోని కాల్వ రోడ్డు బ్రిడ్జి సమీపంలో కాల్వలో మృతదేహం ఉందని అందిన సమాచారం మేరకు పోలీసులు దానిని వెలికితీయించారు. మృతుని వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటాయని మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉందని తెలిపారు. కాల్వకు నీటిని నిలుపుదల చేసిన నేపథ్యంలో మృతదేహం పైకి తేలుతూ కన్పించింది. దానిని పోలీసులు వెలికితీయించి పోస్టుమార్టమ్ నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని బంధువులు, ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఎమ్మెల్యే బొల్లా ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని భూమాయపాలెంలో వేంచేసిన అభయ ఆంజనేయస్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వినుకొండ రూరల్ మండలం నీలగంగవరం గ్రామంలోనూ పంచారామలింగేశ్వరస్వామి తిరునాళ్ల జరిగింది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామాలపెద్దలు ఎమ్మెల్యే బొల్లాకు ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ జీవన విధానంపై అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

వినుకొండటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పర్యావరణహిత జీవన విధానం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ క్షేత్ర అధికారి సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అడవులను పరిరక్షించాలని, చెట్ల పెంపకంపై ఆసక్తి పెంచుకోవాలని, కాలుష్య నివారణకు పాటుపడాలని సూచించారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షించడానికి రోజువారీ జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులూ చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, వినుకొండ ఈస్ట్, వెస్ట్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు మంజూరు



జగనన్న విద్యాకానుక కిట్లు పరిశీలిస్తున్న డెప్యూటీ విద్యాశాఖాధికారి వేణుగోపాల్

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డెప్యూటీ విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల్ చెప్పారు. మంగళవారం స్థానిక జగనన్న విద్యా కానుక కిట్ల స్టోరేజ్ పాయింట్‌ను ఆయన సందర్శించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ మండలంలో 39 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 29 పాఠ్యాంశాలు అవసరమని, ఇందుకుగాను 11,606 పాఠ్యపుస్తకాలు స్టోరేజ్ పాయింట్‌కు చేరినట్లు చెప్పారు. జగనన్న విద్యా కానుక కిట్లు షూస్, సాక్సులు, నోట్‌పుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్టులు, టై, యూనిఫామ్ తదితరాలన్నీ మండల స్థాయిలో భద్రపరిచే గదులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈనెల 25లోగా మిగిలిన విద్యా కానుక కిట్లు నేరుగా మండలానికి చేరతాయన్నారు. ఆయనతోపాటు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలికా శ్రీనివాసరావు, తివిక్రమ్, శ్రీహరి ఉన్నారు.

జనసేన అభ్యర్థిగా నేనే పోటీ చేస్తా

నరసరావుపేట పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్‌జిలాని

నరసరావుపేట: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీతో పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థిగా తాను పోటీచేస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యులు, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని ప్రకటించారు. స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం తన జన్మదిన వేడుకలను నిర్వహించుకున్న ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2016లో తన బయోడేటాను అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు అందజేసి 2018 వరకు సానుభూతిపరుడిగా కొనసాగానని, 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీచేయగా 9 వేల ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. పొత్తులో భాగంగా రానున్న ఎన్నికల్లో నరసరావుపేట నుంచి పోటీచేసే అవకాశం తనకు ఇచ్చేందుకు పవన్, నాదెండ్ల మనోహర్, నాగబాబు సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. పదిరోజుల్లో నాదెండ్ల ఆశీస్సులతో ప్రచారం ప్రారంభిస్తానని జిలాని వెల్లడించారు.

అవినీతిపై విచారణ

నాదెండ్ల: నాదెండ్ల గ్రామ పంచాయతీలో అవినీతి, నిధుల దుర్వినియోగంపై పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన నాలుగో వార్డు పంచాయతీ మెంబర్ దడదాసుల ఆదినారాయణ ఫిర్యాదు మేరకు మంగళవారం ఆరు అంశాలపై విచారణ జరిపిన ఆయన రికార్డులు పరిశీలించారు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శి హయాంలో గ్రామంలో అక్రమంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చి లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని, మరణ ధ్రువీకరణ పత్రం మంజూరులో ముందుగా నాన్ అవైలబుల్ సర్టిఫికెట్ ఇచ్చి, ఆపై మరణధ్రువీకరణ పత్రం మంజూరు చేసినట్లు విచారణలో తేలింది. ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులు పంచాయతీ అనుమతి పొందేందుకు దరఖాస్తు చేసుకోగా, వారి నుంచి వసూలు చేసిన నిధులు పంచాయతీకి జమ కాకపోవటంపై విచారణ జరిపారు. దీనిపై కలెక్టర్‌కు నివేదించనున్నట్లు వివరించారు. అనంతరం పంచాయతీ సర్పంచ్ నాగలక్ష్మి, కార్యదర్శి అరుణ్‌కుమార్‌తో కలిసి ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



లారీ డ్రైవర్ లక్ష్మణ రమణ

దాచేపల్లి : ఆగి ఉన్న లారీ మరో లారీని ఢీకొట్టిన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. మండలంలోని గామాలపాడు సమీపంలోని దాబా వద్ద జరిగిన ఈ ఘటనలో కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన లారీ డ్రైవర్ జి.లక్ష్మణ రమణ(35) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మణ రమణ లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తాను నడుపుతున్న లారీ మరమ్మతులకు గురికావడంతో దాబా సమీపంలో నిలిపివేశాడు. విజయవాడకు చెందిన మెకానిక్ దివాన్ జనేద్ ఆటోలో లారీ వద్దకు చేరుకున్నాడు. లారీకి మరమ్మతులు చేస్తున్న క్రమంలో వెనుక వైపు నుంచి అతివేగంతో వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆగి ఉన్న లారీ డ్రైవర్ లక్ష్మణ రమణను ఢీకొట్టంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ షేక్ ఖాసీంకు కూడా తీవ్ర గాయాలు కావడంతో వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. మెకానిక్ దివాన్ జనేద్‌కు కూడా గాయాలు అయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎస్ఐలు శివనాగరాజు, సంధ్యారాణి పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లట్ల రోడ్డులో ఉన్న నాగుల దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అటవీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



అటవీ సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, ఆ శాఖ అధికారులు

బొల్లాపల్లి : అటవీ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీ శాఖ అధికారులు తెలిపారు. బొల్లాపల్లి సెక్షన్ పరిధిలోని బండ్లమోటులో పర్యావరణహిత జీవన విధానంపై ఆ శాఖ అధికారులు మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. ప్లాస్టిక్ నియంత్రణ, ఇంధన పొదుపు, వృక్ష సంపద అభివృద్ధిపై అటవీ సమీప గ్రామాల్లో ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. అటవీ సంరక్షణపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌వో వై.సూర్యనారాయణ, ఫారెస్ట్ బీట్ అధికారులు రామకృష్ణ, గణేష్‌బాబు పాల్గొన్నారు.